
నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
I పోటీపరీక్షల ప్రత్యేకం
శనివారం 24 ఫిబ్రవరి 2024
నిపుణ
నమస్తే తెలంగాణ
Telangana Today

# పార్లమెంటు చట్టాలు.. సుపరిపాలనకు సోపానాలు

గ్రూప్స్ స్పెషల్

పాలిటీ

**భారత రాజ్యాంగం దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలో సమాఖ్య అనే పదాన్ని ఎక్కడా ప్రయోగించకపోయినా భారతదేశం సమాఖ్య రాజ్యమే. ఎందుకంటే సమాఖ్య మౌలిక లక్షణాలన్నీ భారత సమాఖ్యలో ఉన్నాయి. సమాఖ్యలో అత్యంత ముఖ్య లక్షణం అధికార విభజన. ఆ వివరాలు తెలుసుకుందాం.**



## కేంద్ర, రాష్ట్ర సంబంధాలు

- రాజ్యాంగంలో కేంద్ర రాష్ట్రాల మధ్య చాలా విస్తృతమైన, స్పష్టమైన అధికార విభజన జరిగింది. దీనికి సంబంధించి రాజ్యాంగంలో కేంద్ర రాష్ట్రాల మధ్య మూడు రకాల సంబంధాలను ఏర్పరిచారు. అవి
- కేంద్ర రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలు – ప్రకరణ 245 నుంచి 255 (Legislative Relations)
- కేంద్ర, రాష్ట్రాల మధ్య పరిపాలనా సంబంధాలు – ప్రకరణ 256 నుంచి 263 (Administrative Relations)
- కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలు – ప్రకరణ 264 నుంచి 300 (Financial Relations)
- కేంద్ర రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలు
- భాగం 11లో ప్రకరణలు 245 నుంచి 255 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలను పొందుపరిచారు. శాసన సంబంధాలు అంటే పార్లమెంట్, రాష్ట్ర శాసన సభలు ఏయే అంశాలపై చట్టాలు చేయవచ్చో వివరించే ప్రక్రియ. వీటిని కింది విధంగా తెలుసుకోవచ్చు.
- **ప్రకరణ – 245 :** కేంద్ర పార్లమెంట్, రాష్ట్ర శాసన సభల చట్టాల పరిధి
- పార్లమెంట్ రూపొందించే చట్టాలు దేశంలో అన్ని ప్రాంతాలకు అన్ని సంస్థలకు వర్తిస్తాయి. అంతేకాకుండా పార్లమెంట్ చేసే చట్టాలు ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు కూడా వర్తిస్తాయి.
- ఈ అధికారాన్నే "Extra Territorial Legislation అంటారు. లేదా 'సీమాంతేతర చట్టాలు' అంటారు.
- రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలు ఆ రాష్ట్ర భూభాగాలకు మాత్రమే వర్తిస్తాయి. వీటికి సీమాంతేతర చట్టాల పరిధి లేదు.
- పార్లమెంట్ చేసిన చట్టాలు కొన్ని ప్రాంతాలకు వర్తించవు. ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలి, డామన్, డయ్యూ ప్రాంతాలు. వీటి పరిపాలన రాష్ట్రపతి నేరుగా నియంత్రిస్తారు.
- రాష్ట్రాల్లో ఉన్న కొన్ని షెడ్యూల్డ్ ప్రాంతాలకు కూడా పార్లమెంట్ చట్టాలు వర్తించవు. ఈ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు రాష్ట్రపతి జారీ చేస్తారు. అలాగే అసోం గవర్నర్ ఆ రాష్ట్రంలో ఉన్న అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్‌కు సంబంధించి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

**ప్రకరణ 246 కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన**

- కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను మూడు జాబితాల్లో విభజించారు. వీటికి సంబంధించిన వివరాలను ఏడో షెడ్యూల్డ్‌లో తెలిపారు.

## జాబితాలు

**కేంద్ర జాబితా**

- ఇందులో 97 అంశాలున్నాయి.

**ముఖ్యాంశాలు**

- దేశ రక్షణ, అంతర్జాతీయ వ్యవహారాలు, బ్యాంకింగ్, కరెన్సీ, అణుశక్తి, బీమా, ప్రసారాలు, వైమానిక, నౌకా సర్వీసులను మొదలగు జాతీయ ప్రాముఖ్యత గల విషయాలు కేంద్ర జాబితాలో పొందుపరిచారు.
- కేంద్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలను రూపొందిస్తుంది.

**రాష్ట్ర జాబితా**

- ఇందులో రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు 66 అంశాలున్నాయి. ప్రస్తుతం 59 అంశాలు మాత్రమే ఉన్నాయి. ఈ జాబితాలో ఎంట్రీ 11, 19, 20, 29, 36లోని అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చడం జరిగింది.

**గమనిక :** 101వ రాజ్యాంగ సవరణ చట్టం 2016 వల్ల రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో కేంద్ర జాబితాలోని అంశాల సంఖ్య 100 నుంచి 97 రాష్ట్ర జాబితాలోని అంశాల సంఖ్య 61 నుంచి 59కి తగ్గింది. అయితే ఉమ్మడి జాబితాలోని అంశాల సంఖ్యలో (52) ఎలాంటి మార్పు లేదు.

**ముఖ్యాంశాలు**

- శాంతి భద్రతలు, పోలీసు, వ్యవసాయం, నీటిపారుదల, స్థానిక సంస్థలు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, జైళ్లు, గ్రంథాలయాలు, మార్కెట్లు, వడ్డీ వ్యాపారం మొదలైన స్థానిక ప్రాముఖ్యత గల అంశాలను ఈ జాబితాలో పొందుపరచవచ్చు.

**ఉమ్మడి జాబితా**

- రాజ్యాంగం ప్రారంభంలో ఈ జాబితాలో 47 అంశాలు ఉండేవి. ప్రస్తుతం 52 అంశాలున్నాయి. ఈ జాబితాలోని ఎంట్రీ నంబర్స్ 11ఎ న్యాయపాలన, సబార్డినేట్ కోర్టుల వ్యవస్థీకరణ, 17ఎ అడవులు, 17బి వన్యప్రాణుల సంరక్షణ, 20ఎ జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, 25 సాధారణ విద్య, సాంకేతిక విద్య, 33ఎ తూనికలు కొలతలు.
- పై అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి చేర్చారు. అందువల్ల ఉమ్మడి జాబితాలోని అంశాలు 47 నుంచి 52 కు పెరిగాయి. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్ర శాసనానికి రాష్ట్ర శాసనానికి మధ్య వైరుధ్యం ఏర్పడితే కేంద్ర శాసనానికే ఆధిక్యత ఉంటుంది.
- అయితే ప్రకరణ 254 ప్రకారం ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్ర శాసనసభ, రాష్ట్రపతి పూర్వానుమతి తీసుకుని చట్టం చేస్తే ఇదే అంశంపై పార్లమెంట్ కూడా చట్టం చేస్తే.. పార్లమెంట్ చేసిన చట్టం, రాష్ట్ర శాసనసభ చేసిన చట్టానికి విరుద్ధమైతే, రాష్ట్ర శాసనసభ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది.

**ప్రకరణ 248 అవశిష్ట జాబితా**

- అవశిష్ట జాబితాలోని అంశాలపై పార్లమెంట్ మాత్రమే చట్టం చేస్తుంది. అవశిష్ట జాబితా అంటే రాష్ట్ర జాబితాలో, ఉమ్మడి జాబితాలోనూ ప్రస్తావించబడని అంశాలు.

**ప్రకరణ 249**

- ప్రకరణ 249 ప్రకారం జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యసభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో ఒక తీర్మానం చేస్తే ఆ తీర్మానాన్ని లోక్‌సభ కూడా ఆమోదిస్తే ఆ అంశంపై పార్లమెంట్ చట్టాలను రూపొందిస్తుంది. ఈ విధంగా పార్లమెంట్ రాష్ట్ర జాబితాలో చేసిన చట్టాలు ఒక సంవత్సరం వరకే అమలులో ఉంటాయి. అవసరం అనుకుంటే మరొక సంవత్సరం పొడిగించవచ్చు. గడువు ముగిసిన వెంటనే తాత్కాలికంగా కేంద్ర జాబితాలోకి బదలాయించబడిన అంశం రాష్ట్ర జాబితాలోకి చేరుతుంది.

**ప్రకరణ 250**

- ప్రకరణ 250 ప్రకారం దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు (352) పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలను రూపొందిస్తుంది. అటువంటి శాసనం అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నంత కాలం చెల్లుబాటు అవుతుంది. అయితే అత్యవసర పరిస్థితి ఎత్తేసిన ఆరు మాసాల తర్వాత ఆ చట్టాలు రద్దవుతాయి.

**ప్రకరణ 251**

- ప్రకరణ 249, 250 ప్రకారం పార్లమెంట్ రాష్ట్ర జాబితాలో చేసిన చట్టాలను అంతుకు ముందు రాష్ట్రాలు తమ జాబితాలో చేసుకున్న చట్టాలకు వైరుధ్యం ఏర్పడితే పార్లమెంట్ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది.

**ప్రకరణ 252**

- రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనార్థం రాష్ట్ర జాబితాలో చట్టాలు చేయమని కోరితే అలా కోరిన రాష్ట్రాలకు వర్తింపజేస్తూ రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తుంది. ఉదాహరణకు ఎస్టేట్ సుంకం చట్టం – 1955, ప్రైజ్ కాంపిటీషన్ చట్టం – 1955, వన్యప్రాణి సంరక్షణ చట్టం – 1972, జల కాలుష్య నివారణ చట్టం – 1974, పట్టణ, ఆస్తుల పరిమితి చట్టం –1076, మానవ అవయవాల మార్పిడి చట్టం 1994 మొదలైన చట్టాలను పార్లమెంట్ రూపొందించి రాష్ట్రాలకు వర్తింపజేసింది.

**ప్రకరణ 253**

- అంతర్జాతీయ ఒప్పందాల అమలు కోసం అవసరమైన శాసనాలను రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ఈ ఒప్పందాల అమలుకు రాష్ట్రాల చట్టాలు అవరోధాలుగా ఉంటే వాటిని పార్లమెంట్ సవరించవచ్చు.
- ఉదాహరణకు ఐక్యరాజ్యసమితి ప్రత్యేక అవసరాల రక్షణ చట్టం 1947, జెనీవా ఒప్పంద చట్టం 1960, హైజాకింగ్ వ్యతిరేక చట్టం 1982 మొదలైనవి పార్లమెంట్ రూపొందిస్తుంది.

**ప్రకరణ 254**

- ఉమ్మడి జాబితాలోని వైరుధ్యాలను తొలగించడం
- పార్లమెంట్ రూపొందించిన శాసనానికి, రాష్ట్ర విధాన సభలు రూపొందించిన శాసనం విరుద్ధంగా ఉంటే పార్లమెంట్ రూపొందించిన శాసనానికే ఆధిక్యత ఉంటుంది.

**ప్రకరణ 255**


- కొన్ని చట్టాలను రూపొందించే సమయంలో రాష్ట్రపతి, గవర్నర్‌ల పుర్వానుమతి అవసరం.

## పరిపాలనా సంబంధాలు

- భాగం II, ప్రకరణలు 256 – 263
- కేంద్ర రాష్ట్రాల మధ్య సాధారణ పరిస్థితుల్లో, పరిపాలనా సంబంధాల గురించి విస్తృతంగా ఈ భాగంలో పొందుపరిచారు. ఈ సంబంధాలనే మున్సిపల్ సంబంధాలు అని కూడా అంటారు. దైనందిన పరిపాలన అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తుంది.

**ప్రకరణ 256**

- ప్రతి రాష్ట్ర ప్రభుత్వం తన కార్యనిర్వహణాధికారాలను, పార్లమెంట్ చేసిన చట్టాలకు లోబడే వినియోగించాలి. అందుకోసం కేంద్రం రాష్ట్రాలకు కొన్ని పరిపాలనా ఆదేశాలను జారీ చేయవచ్చు.




**ప్రకరణ 257**

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వహణాధికారాలను నియంత్రించవచ్చు. రాష్ట్రాలు తమ అధికారాలను వినియోగించుకునే సందర్భంలో కేంద్ర ప్రభుత్వ అధికారాలను ప్రశ్నించే విధంగా ఉండకూడదు.
- రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ ఆస్తులైన రైల్వేలు, టెలీ కమ్యూనికేషన్ మొదలైన ఇతర కేంద్ర ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి. వాటి పరిరక్షణకు అయ్యే ఖర్చు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తిరిగి చెల్లిస్తుంది.

**ప్రకరణ 258**

- రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ అంగీకారంతో షరతులతో, షరతులు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని పాలనా విధులను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించవచ్చు.

**ప్రకరణ 258 ఎ**

- రాష్ట్ర గవర్నర్ అంగీకారంతో షరతులతో, షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వ పాలనా విధులను కేంద్ర ప్రభుత్వానికి బదలాయించవచ్చు.
- ప్రకరణ 259 ని 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

**ప్రకరణ 260**

- భారత ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా భారతదేశం బయట ఉన్న భూభాగాల పరిపాలనను చేపట్టవచ్చు.

**ప్రకరణ 261**

- దేశంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు జారీ చేసిన ధ్రువ పత్రాలను పబ్లిక్ రికార్డులను న్యాయ తీర్పులపై సమ్మకముంచి గౌరవించాలి. ప్రకరణ 262 ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాలు, నదీ లోయకు చెందిన జలాల వినియోగం పంపిణీ లేదా నియంత్రణకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి పార్లమెంట్ ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయవచ్చు.

**ప్రకరణ 263**

- భారత రాష్ట్రపతి ఒక అంతర్రాష్ట్ర మండలి ఏర్పాటు చేయవచ్చు. అంతర్రాష్ట్ర మండలికి ప్రధానమంత్రి హోదారీత్యా అధ్యక్షుడిగా ఉంటాడు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల పాలకులు అందులో సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర వివాదాలకు సంబంధించిన అంశాలపై విచారణ చేసి సలహాలు ఇస్తారు.
- మొదటిసారిగా 1990లో అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేశారు.

జీబీకే పబ్లికేషన్స్
హైదరాబాద్, 9959361278